




*తెలుగు జానపద గీతాలకి, జనపద సంగీతానికి కొత్త ప్రాణం పోసిన విదుషీమణి ‘కళాప్రపూర్ణ‘ శ్రీమతి అవసరాల(వింజమూరి)అనసూయాదేవిగారి గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. 92 సంవత్సరాల వయసులో ఆమె వ్రాసిన వ్యాస పరంపర ఇది. అనసూయదేవిగారి సుదీర్ఘ జీవనప్రయాణంలో ఆమె కలుసుకున్న ప్రముఖ వ్యక్తులతో తన పరిచయాల గురించి ఈ శీర్షికలో వివరిస్తున్నారు.*

***తల్లావఝ్ఝుల శివశంకర శాస్త్రిగారు***

ఈయన్ని ‘పెద్దమామయ్యగారు‘ అని పిల్చేవాళ్ళం. ఈయన రచనల్లో నాకు జ్ఞాపకం ఉన్నది ఒక్క ‘పద్మావతీ చరణ చారణ చక్రవర్తి‘ వీరి పద్యాలు రేడియోలోనూ, మరెన్నో చోట్ల చదివాను.

పెద్దమామయ్య గారెప్పుడూ మా ఇంట్లోనే దిగేవారు. వీరు భోజన ప్రియులు, పొద్దున్నే మొదటి కాఫీని ప్రిలిమినరీ కాఫీ అనేవారు రెండోసారి యాక్చువల్ కాఫీ ఇమ్మనేవారు. మూడోసారి కాఫీ విత్ సమ్ స్టఫ్ (అంటే బ్రేక్‌ఫాస్ట్ అన్నమాట) అనేవారు. తర్వాత ఓ గంటలోనే వంటింట్లోకి వెళ్ళి ఓ కప్పు చారో, సాంబారో తాగేవారు. భోజనం వరకూ, ఆరారగా ఏదో పడాలి.

‘ఒంగోలు దగ్గర ఆశ్రమం పెట్టాను. విజిట్ చేయి కోడలా!‘ అన్నారు.

‘అక్కడ భోజనం పెడతారా!‘ అన్నాను.

‘అన్నం తప్ప అన్నీ పెడతా‘మన్నారు.

‘కాలక్షేపం ఎలాగ‘ అన్నాను.

‘చంపుళ్ళు లేని గేమ్స్ ఆడుకోడమే‘ అన్నారు. పైగా, ‘ఎంట్రెన్స్ కన్యలకు, విడోస్‌కి మాత్రమే‘ అన్నారు.

‘మరి నన్నెలాగ రమ్మంటున్నారు‘ అన్నాను.

‘నువ్వు నా మేనకోడలివి కనక‘ అన్నారు.

ఇలా విచిత్రమైన వ్యక్తులు, వ్యక్తిత్వాలు, ఆసక్తికరమైన సంభాషణలు, తెలివైన ఛలోక్తులతో, మెదడుకు పదును పెట్టే మాటలతో ఆ రోజుల్లో జీవితం చాలా కాలక్షేపంగా ఉండేది.

***వింజమూరి శివరామారావు***

రామం అన్నయ్య నా పినతల్లి కొడుకు. పిఠాపుర ఆస్థాన కవి సోదరులలో ఒకరైన సుబ్బరాయశాస్త్రిగారి మనుమడు. పరంపరగా వచ్చిన కవిత్వంతో ఎన్నో, పాటలూ, గేయనాటికలూ రాసినకవి. విజయవాడ రేడియో స్టేషన్‌లో పనిచేశాడు. రామం అన్నయ్య పాటలెన్నింటికో సంగీతం కూర్చి, సభల్లోను, మద్రాసు విజయవాడ, హైదరాబాద్ రేడియో ప్రసారాలలో నేనూ పాడాను.

●●●

***శ్రీరంగం శ్రీనివాసరావుగారు***

వీరే శ్రీశ్రీగారు. ఈయన ఒక లెజెండ్ వీరిని గురించి నాకంటే ఎక్కువ తెలుసున్నవాళ్ళున్నారు. అందుకే మీకు తెలియని విశేషాలు, నా సంగీతంతో ముడిపడ్డ విషయాలు మాత్రమే రాస్తున్నాను.

1935లో శ్రీశ్రీగారు మొదటిసారి మాఇంటికి వచ్చారు. సన్నగా, పీలగా, హైస్కూలు స్టూడెంట్‌లా కనపడుతున్న శ్రీశ్రీ భుజం మీద చేయివేసి, నాకు చూపిస్తూ, మా కృష్ణశాస్త్రి మామయ్య, 'చిన్నతల్లీ (నన్నలాగ పిలిచేవాడు) ఓ కుర్రకవిని తీసుకు వచ్చానే. ఇతని పాటొకటి రేపటి సభలో పాడాలి' అన్నాడు. శ్రీశ్రీ గారి చేతిలోని 'మహాప్రస్థానం'రాత ప్రతి అందుకని తిరగేసి, ఒకపాట తీసి 'దీనికి ట్యూను పెట్టు' అన్నాడు. ఆ పాటే 75 ఏళ్ళ క్రిందట ఆంధ్రులు అభిమానించిన రివల్యూషనరీ సాంగ్, సభల్లో శ్రోతలు కోరి కోరి పాడించుకున్న పాట, 'మహాప్రస్థానం'లోని 'మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది, పదండి ముందుకు పదండి తోసుకు పోదాం పోదాం పైపైకి. '

అలనాటి కవుల భావగీతాల్లో శృంగారం, కరుణ, భక్తి రసాలు ఎక్కువగా కనపడతూండేవి. శ్రీశ్రీగారు, మామయ్య కృష్ణశాస్త్రిని 'బాష్ప కవితా నయాగరా' అన్నారు. అప్పటి కవుల పాటలు జంపెతాళం, మిశ్రచాపు తాళాలు అనుగుణంగా ఉండి, కాస్త స్లో మోషన్ తో పాడుతుంటే బాగుండేవి. అలా అలవాటు పడ్డ నాకు శ్రీశ్రీ గారి 'మరోప్రపంచం' కొత్త రీతిగా ఉండడం వల్ల,కొత్త తరహాలోనే ట్యూన్ వచ్చింది చదువుతూంటేనే. ఈ పాటకి వార్ధక్యం లేదు. 75 ఏళ్ళ క్రిందటి ట్యూన్ అయినా, ఇప్పుడు విన్నా మెచ్చుకుంటున్నారు. పాడనా?

ఈ పాట పాపులారిటీ విని, హిజ్ మాస్టర్స్ వాయిస్ వారు రికార్డు చేశారు. పెద్దపాట అవడం వల్ల రికార్డు రెండు సైడ్స్ పాడవలసి వచ్చింది. రంజిత్ రాయనే మ్యూజిక్ డైరెక్టర్ మార్చింగ్ సాంగ్స్‌కి ఆర్కెస్ట్రా పెట్టారు. అషిత్ బరన్ తబలా వాయించారు. తర్వాత వీరు న్యూ థియేటర్ ఫిల్మ్స్‌లో హీరోగా నటించారు. మొదటిసారిగా శ్రీశ్రీ గారి పాట ట్యూన్ పెట్టిన దాన్ని నేను. పాడిందాన్ని నేను గ్రామఫోన్ రికార్డు ఇచ్చిన దాన్ని నేను. కావలిస్తే ప్రసిద్ధ సంగీత - నృత్యకళా విమర్శకుడు వి.ఏ.కె రంగారావుగారి నడగండి.

శ్రీశ్రీగారు స్పెషల్ మనిషి. 'మరో ప్రపంచం' నాస్పెషల్ పాట.

●●●

***భమిడిపాటి రామసోమయాజులుగారు***

అలనాటి కవులలో వీరొకరు. చోడవరంలో ఉండేవారు. ఆ ఊళ్ళో నా పాట కచేరీ జరిగింది. ఇది కూడా మరచిపోలేని కచేరి. విశాఖపట్నం నుంచి కారులో వెళ్ళాం. మా కుటుంబంతో పాటు, దుర్గాబాయమ్మక్కగారు, వారి స్నేహితురాలు పుష్పలతా సకియు వచ్చారు. భమిడిపాటి రామసోమయాజులగారింట్లో ఉన్నాం. అప్పటికప్పుడు ఆయనొక పాట రాశారు. అది నేను ట్యూన్ పెట్టి, ఆనాటి సభలో పాడాలని కోరుకున్నారు. ఆ పాట 'సందెచీకట్లలో చల్లగాలి రవంత' అనేది. నన్ను నేను పొగుడుకుంటే బాగుండదు కానీ, ఈ పాట మీరు వినుంటే 'శహభాష్' అని మెచ్చుకునుందురు.

●●●

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Click here to share your comments on this article.